క్లుప్తంగా

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడారు. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం అయ్యేందుకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

శ్రీ శంకర జయంతి ఉత్సవాలు



బాపట్ల: వేద మంత్రాల మధ్య శ్రీ శంకర జయంతి ఉత్సవాలు శ్రీ శంకర విద్యాలయంలో మంగళవారం జరిగాయి. హోమాలు, లక్ష్మీ వనం, గణపతి హవనం, రుద్ర హోమం నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించారు. విద్యాలయ సంఘ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4 నుంచి వీరాంజనేయ స్వామి ఉత్సవాలు



జంపని(వేమూరు): జంపని గ్రామంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవాలు మే 4 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి తెలిపారు. సీతారామాంజనేయ కల్యాణ మండపంలో ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం కరపత్రాలు ఆవిష్కరించారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఏకాదశి దీక్షతో 11 రోజులు నిర్వహించే వార్షిక ఉత్సవాలు 14న హనుమజ్జయంతి పర్వదినం వరకు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు స్వామివారికి పంచామృతాభిషేకం తదితర పూజలు జరుగుతాయని చెప్పారు. పల్లకి ఉత్సవం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాలకు భక్తుల అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పశు వైద్యశాల తనిఖీ



భట్టిప్రోలు: భట్టిప్రోలు పశు వైద్యశాలను మంగళవారం మండల ప్రత్యేకాధికారి, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యశాలలో రికార్డులు పరిశీలించారు. పరీక్షలు, వైద్య సేవల గురించి ఆరా తీశారు. పశు పోషకులకు పలు సూచనలు ఇచ్చారు. వైద్యశాల ఆవరణలోని చెరువు వద్ద కాంపౌండ్ వాల్ అసంపూర్తిగా ఉండటంతో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావుతో మాట్లాడారు. నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పంచాయతీ రాజ్ ఏఈ శేతు రామచంద్రరావు, పశువైద్యశాల అధికారిణి బొర్రా లక్ష్మీరంజిత, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ నేతల నిరసన



బాపట్ల అర్బన్: తెలంగాణలో అధికారంలోకి రాగానే ముస్లింలకు రిజర్వేషన్ రద్దు చేస్తామన్న కేంద్రమంత్రి, బీజేపీ నేత అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం కాంగ్రెస్ నేతలు బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో నిరసన చేపట్టారు. బాపట్ల జిల్లా పార్టీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హిందువులను, ముస్లింలను విభజించటమే అజెండాగా పెట్టుకొని, మత విద్వేష వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. 2024లో ప్రధానిగా రాహుల్ గాంధీ బాధ్యతలు చేపట్టి పేదరికం, నిరుద్యోగం, అధిక ధరలను నియంత్రించి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభ్యున్నతికి పాటుపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఖలీల్ ఖాన్, అబ్దుల్ అజీజ్, దేవరాజ్, శంకర్ రెడ్డి, కట్ట లాజర్, శీలం సాగర్, రషీద్, భాష, రఫీ, నాగూర్, నలిని, రేణుక పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు'కు విశేష స్పందన

ఎమ్మెల్యే కోన రఘుపతి



కర్లపాలెంలో బ్రోచర్ అందజేసిన ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: 'రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. వలంటీర్ల వ్యవస్థ బాగుందా'.. అంటూ ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రజలను పలకరించారు. 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. బ్రోచర్లు అందజేసి, మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు ఇంటింటికీ అంటించారు. ఏట్రవారిపాలెం, కర్లపాలెం పంచాయతీల పరిధిలోని కర్లపాలెం సెంటర్‌లో సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి విశేష స్పందన వస్తోందన్నారు. ఇప్పటికే సుమారుగా కోటి కుటుంబాలు మిస్డ్‌కాల్ ద్వారా ప్రభుత్వానికి తమ మద్దతు తెలిపాయని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం మళ్లీ వస్తేనే..తమ పిల్లల భవిష్యత్తు బాగుటుందని ప్రజలు చెబుతున్నారని కోన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు, బాపట్ల మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, బాపట్ల రూరల్ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, సర్పంచ్‌లు అక్కల శ్రీనివాసరెడ్డి, పిట్టు నాగాంజనేయరెడ్డి, ఎంపీటీసీలు ఆసిఫ్ అలీ, అమీర్‌బేగ్, తాంద్ర సాంబశివరావు, రాతంశెట్టి లక్ష్మణరావు, నాయకులు గుండ్రెడ్డి శివ, పీవీ నరేష్, ఆట్ల పెద్ద శ్రీనివాసరెడ్డి, చీరాల సత్యనారాయణరెడ్డి, పరమానంద కుమార్, కూచిపూడి శ్యామ్యూల్ జాన్, హరిబాబు రెడ్డి, ప్రసాద్, జగ్గయ్య, బెనర్జి, మాల్యాద్రి, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

పిట్టలవానిపాలెం: సంగుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు పారె ధనుంజయ యాదవ్, బోలె అశోక్ జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సంక్షేమ లబ్ధి పొందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు కోరుతూ.. స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అంటించారు. పాణ్యం శ్రీనివాసరావు, బుడ్డా సాయి, చెన్నుబోయిన రామారావు వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కన్యకా పరమేశ్వరి ఉత్సవాలు

నిజాంపట్నం: నిజాంపట్నం సంత బజారులోని శ్రీ నగరేశ్వర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిజాంపట్నం వాసవి సేవా సంఘం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. 30వ తేదీ వరకూ ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు. 26న అమ్మవారికి అభిషేకాలు, జ్యోతి ప్రజ్వలన, శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి పూజ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. 27న సామూహిక కుంకుమార్చన, మంత్రపుష్పం, 28న ముత్తైదువుల సామూహిక కుంకుమార్చన, 29న సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, అమ్మవారి చీరల వేలం పాట, ఊయలసేవ, 30న దంపతులతో పూజా కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. అమ్మవారి నగరోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

3 నుంచి బగళాముఖి అమ్మవారి తిరునాళ్ల

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి తిరునాళ్ల మే 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి మంగళవారం తెలిపారు. 3న గ్రామంలో అమ్మవారి ఘటముల గ్రామోత్సవం , 4న చెరుకుపల్లి మండలం కుంచలవారిపాలెంలో గ్రామోత్సవం, 5న భవనంవారి పాలెం, చోడిపాలెం గ్రామాల్లో, 6న సంగుపాలెం, కోడూరు గ్రామాల్లో గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు. 6న అమ్మవారికి పురాతన బంగారపు ఆభరణాలు అలంకరించడం జరుగుతుందని తెలిపారు. 7న అమ్మవారి దేవాలయంలో పొంగళ్ళు, నైవేద్యాలు సమర్పణ, మొక్కుల చెల్లింపుల కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

వారంలో భూమి శిస్తు వసూలు పూర్తిచేయాలి



మాట్లాడుతున్న తహసీల్దారు కవిత

పిట్టలవానిపాలెం: భూమి శిస్తు వసూళ్ల విషయంలో వీఆర్వోలకు వలంటీర్లు సహకరించాలని మండల తహసీల్దారు డి.కవిత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వలంటీర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వసూళ్లపై దిశానిర్దేశం చేశారు. వీఆర్వోలతో కలిసి వారంలోపు మండలంలోని భూమి శిస్తు వసూలు పూర్తి చేసేవిధంగా చూడాలని సూచించారు. ప్రతి రోజూ ఒకరిద్దరు రైతుల నుంచి ఒక్కో వలంటీర్ శిస్తు వసూలు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ పద్మజ, గ్రామ కార్యదర్శులు శ్రీనివాసరావు, వసుంధర, శ్రీనివాసరావు, శివకుమార్, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ఉన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

భట్టిప్రోలు: ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం ర్యాలీని భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు చావలి రామలక్ష్మి మాట్లాడుతూ.. ప్రజల్లో మలేరియాపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. దోమ తెరలు వాడి, మలేరియా నుంచి రక్షణ పొందాలని కోరారు. రెండు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, ప్రధాన కూడళ్లల్లో మానవహారం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం .హనుమంతరావు, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర రావు, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, భట్టిప్రోలు, వెల్లటూరు సర్పంచులు దారా రవి కిరణ్మయి, చౌటూరి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వాకా వెంకట నారాయణ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

దోమల నివారణతోనే వ్యాధులు దూరం

రేపల్లె రూరల్: దోమల నివారణతోనే అనేక వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చని, దోమల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మోళ్ళగుంట, విశ్వేశ్వరం, భట్టిప్రోలు, వెల్లటూరు పీహెచ్‌ల ఆరోగ్య సిబ్బంది మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. జ్వరంతో పాటు విపరీతమైన చలి, కొన్ని సందర్భాలలో వాంతులు, విరోచనాలు ఉండటం మలేరియా వ్యాధి లక్షణాలన్నారు. ఆరోగ్య శాఖ యాప్స్‌పై ఎంపీప హాలులో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా గణాంకాధికారి వేణు, డాక్టర్ మల్లికార్జునరావు, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ కృష్ణయ్య, రామలక్ష్మి పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, కళాశాల ఉమెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సభ్యురాలు శైలజ, కో–ఆర్డినేటర్ నరసయ్య, నిరంజన్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కరిముల్లా, ప్రభాకర్ పాల్గొన్నారు.



వెదుళ్ళపల్లి వైద్యాధికారిణి ప్రియదర్శిని ఆధ్వర్యంలో ర్యాలీ

పరిశుభ్రతతో దోమల నివారణ

బాపట్ల: పరిసరాలు పరిశుభ్రతతోనే దోమల నివారణకు అవకాశం ఉందని వెదుళ్ళపల్లి వైద్యాధికారిణి డాక్టరు మానస ప్రియదర్శిని పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా వెదుళ్ళపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. దోమలు నివారణకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేలో ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ చంద్రశేఖర్, పీహెచ్ఎన్ పద్మ, సిబ్బంది రవిశంకర్, రేవిక, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

జగత్‌గురువు ఆది శంకరాచార్యులు

భట్టిప్రోలు: హిందూ ధర్మ ఐక్యతకు అద్వైతాన్ని ప్రబోధించిన మహానుభావుడు ఆది శంకరాచార్యులని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. ఐలవరంలోని రామ మందిరంలో జగత్‌గురువు ఆది శంకరాచార్యులు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. హేమ శంకరరావు భక్తులనుద్దేశించి మాట్లాడారు. శంకరాచార్యులు కాలి నడకన దేశమంతటా తిరిగి అష్టాదశ పీఠాలను స్థాపించారని చెప్పారు. హిందూ ధర్మ ఐక్యత కోసం కృషి చేసి 32 సంవత్సరాలకే పరమపదించారని వెల్లడించారు.

నాణ్యతా ప్రమాణాలతో 'నాడు–నేడు' పనులు

చెరుకుపల్లి: మండలంలో నాడు–నేడు పథకం కింద ఫేజ్ -2లో జరుగుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా సర్వ శిక్ష అభియాన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాగజ్యోతి సూచించారు. గుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని 16 పాఠశాలల్లో జరుగుతున్న తరగతి గదుల నిర్మాణ పనులను మంగళవారం రాజీవ్ విద్యా మిషన్ ఏఈ రాజేష్‌తో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ చైర్మన్‌లు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గుళ్లపల్లి పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మంచాల విజయ్ కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుళ్లపల్లి జెడ్పీ పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న ఈఈ నాగజ్యోతి

రైతుల కోసం పరపతి సంఘాల బలోపేతం

నగరం: రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలను(పీఏ సీఎస్)బలోపేతం చేస్తోందని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య పేర్కొన్నారు. నగరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మత్తి రవికుమార్ ప్రమాణస్వీకార మహోత్సవం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. పీఏసీఎస్‌లలో అతి తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఎరువులను సబ్సిడీపై ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పీఏ సీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ రవికుమార్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తొలుత ఏపీసీఎస్ అధికారులు మత్తి రవికుమార్‌తో ప్రమాణం చేయించారు. అనంతరం రవికుమార్‌ను ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ కార్యదర్శి రామకృష్ణ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

న్యాయమూర్తులకు సత్కారం

తెనాలిరూరల్: బదిలీ అయిన తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి టి.రామచంద్రుడు, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అభినందన సభను తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. బదిలీ అయిన న్యాయమూర్తులను సోమవారం సత్కరించారు. ముఖ్య అతిథిగా 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, హరిదాసు గౌరీశంకర్, కంచర్ల రాజశేఖర్, గడ్డిపాటి రాంబాబు, వెలినేని రాఘవయ్య, ఎంఎన్ జగదీశ్వరాంబ, ఏపీపీ ఎలిజబెత్‌రాణి, ఇతర న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చెరుకుపల్లి: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఏడు వలంటీర్ల పోస్టులకు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. బలుసులపాలెం, చెరుకుపల్లి-1, గూడవల్లి, తూర్పుపాలెం పంచాయతీలలో వలంటీర్ పోస్టులకు 20 మంది ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. వారిలో 8 మంది మాత్రమే హాజరయ్యారని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా త్వరలోనే ప్రకటించి, నియామక పత్రాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.నిరంజన్‌బాబు, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ జి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పెరటి కోళ్లతో లాభాలు బాగు..

- పొదుపు మహిళలకు పంపిణీ
- ఆర్థికాభివృద్ధికి ఉపయుక్తం

వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం జాతి కోళ్ల పంపిణీ చేపట్టింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందేందుకు పెరటి కోళ్ల పెంపకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా డ్వాక్రా గ్రూపుల మహిళలకు వేమూరు నియోజక వర్గంలో 300 యూనిట్లు అందజేశారు. ఇందులో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు మండలాలకు వంద లెక్కన యూనిట్లు వచ్చాయి. వేమూరు మండలంలో మూడు క్లస్టర్లు ఉన్నాయి. వేమూరు క్లస్టర్‌కు 33, జంపని క్లస్టర్‌కు 33, పెరవలి క్లస్టర్‌కు 34 యూనిట్లు పంపిణీ చేశారు. యూనిట్‌కు 12 కోళ్లు ఉంటాయి. వాటిలో 3 పుంజులు, 9 కోళ్లు. లబ్ధిదారులు యూనిట్‌కు రూ.4,800 చెల్లిస్తే.. కోళ్లతో పాటు 30కిలోల ధాన్యం, మెడికల్ కిట్ ప్రభుత్వం అదజేస్తోంది.

కోళ్ల పెంపకం వల్ల ఉపయోగాలు

ఒక జాతి కోడి సుమారు 60 గుడ్లు పెడుతుంది. ఒక కోడి సుమారు మూడు కిలోల బరువు పెరుగుతుంది. మార్కెట్‌లో జాతి కోడి మాంసం కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. ఈ కోడి గుడ్లులో పౌష్టికాహారం అధికంగా ఉంటుంది. అందు వల్ల వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గతేడాది నియోజకవర్గంలో భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో యూనిట్లు పంపిణీ చేశారు. డ్వాక్రా గ్రూపు మహిళలు ఎక్కువ లాభాలు చూడటంతో..ఈ ఏడాది నియోజక వర్గంలోని మూడు మండలాల్లో యూనిట్లు అందించడం జరిగిందని అధికారులు తెలిపారు.



జంపని గ్రామంలో పెరటి కోళ్ల పంపిణీ చేస్తున్న అధికారులు

కోళ్లు పెంపకం వల్ల అధిక రాబడి

డ్వాక్రా గ్రూపుల మహిళలు నాటు కోళ్ల పెంపకం వల్ల ఆదాయం పొందుతున్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొస్తోంది.

– శోభన్ బాబు, ఏపీఎం, వేమూరు.

ఆర్మీ ఉద్యోగి భార్య ఆత్మహత్యాయత్నం

తాడేపల్లిరూరల్: ఆర్మీలో ఉద్యోగం చేస్తున్న తన భర్త తనను పట్టించుకోవడం లేదని మనస్తాపం చెంది తన మూడు నెలల చిన్నారితో కలసి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. పోలీసులు ఆమె ప్రయత్నాన్ని అడ్డుకుని తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు..తిరుపతికి చెందిన నాగరాజు, ఉషారాణిల కుమారుడు వేణుగోపాలనాయుడు ఆర్మీలో పనిచేస్తున్నాడు. విశాఖపట్నంకు చెందిన భానును 2019లో వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికి మూడు నెలల చిన్నారి ఉంది. పాప పుట్టిన దగ్గర నుంచి పట్టించుకోకపోవడం, మాట్లాడకపోవడంతో భాను పాపను తీసుకుని హిమాచల్‌ప్రదేశ్ వెళ్లింది. అక్కడ కూడా భార్యతో మాట్లాడకుండా ఇబ్బంది పెట్టాడు. అనంతరం తిరిగి మరల విశాఖపట్నంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన భాను దగ్గరకు 20 రోజుల క్రితం వేణుగోపాల్ వచ్చి తిరిగి మరల తిరుపతి వెళ్లి ఆమెతో మాట్లాడకపోవడంతో మనస్తాపం చెందిన భాను ఆదివారం వైజాగ్‌లోని పుట్టింటి నుంచి బయటకు వచ్చి మంగళవారం ఉదయం విజయవాడ వచ్చి ప్రకాశంబ్యారేజ్‌పై అనుమానాస్పదంగా తిరిగింది. ఆమె ప్రవర్తనపై అనుమానం వచ్చిన ప్రకాశం బ్యారేజ్ ఔట్ పోస్ట్ సిబ్బంది ప్రశ్నించారు. జరిగిన విషయాన్ని పోలీసులకు తెలుపడంతో విశాఖలో ఉన్న భాను తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ప్రస్తుతం భానును, చిన్నారిని మేరీ హోమ్స్‌లో ఉంచినట్లు పోలీసులు తెలిపారు.

కనుల పండువగా కాళికాంబ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో కాళికాంబ సమేత వీరభద్ర స్వామి

కర్లపాలెం: భక్తుల కొంగు బంగారం, కర్లపాలెం గ్రామదేవత కాళికాంబ సమేత వీరభద్ర స్వామి ఆలయ వార్షిక తిరునాళ్ల సోమవారం రాత్రి కనుల పండువగా జరిగింది. అమ్మవారి విగ్రహాలకు వివిధ రకాల పూలమాలలతో, నిమ్మకాయల దండలతో అలంకరించారు. మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో భక్తులు తీసుకువచ్చిన పసుపు కుంకుమలతో అమ్మవారికి ఆలయ పూజారులు అర్చనలు, విశేష పూజలు చేశారు. విద్యుత్ కాంతుల్లో ఆలయం వెలిగిపోయింది. ఆలయ కమిటీ సభ్యులు కాళికాంబ సమేత వీరభద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా అమ్మవారి చిత్ర పటాలతో సుందరమైన విద్యుత్ ప్రభను పెట్టారు. మంగళవారం ఉదయం భక్తులు, మహిళలు పొంగళ్ళు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

క్రీడాకారులకు అభినందన

చెరుకుపల్లి: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించటం అభినందనియమని పొన్నపల్లి ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి అన్నారు. ఇటీవల అనంతపురం జిల్లాల్లో టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 రాష్ట్రస్థాయి పోటీల్లో స్కూల్ కు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వారిలో బి.రాఘవనాని, ఎస్. సాత్విక్ రెడ్డి, వి.గౌతమ్, సుహాస్ ప్రిన్స్ ఉన్నారు. సౌత్ ఇండియా టెన్నిస్‌బాల్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులను, కోచ్ విష్ణువర్ధన్ రెడ్డి ని ప్రిన్సిపల్ నర్గిజ్ క్వాజీ, ఉపాధ్యాయులు అభినందించారు.



క్రీడాకారులతో చైర్మన్ పైనం ఏడుకొండలరెడ్డి

సేవాతత్పరత కలిగి ఉండాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రేపల్లె: విద్యార్థి దశ నుంచే సేవాతత్పరతను కలిగి ఉండాలని ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థల డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఆర్‌సీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం గాస్పల్ ఫీల్డ్స్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతపై మాట్లాడారు. ఐఆర్ఈఎఫ్ పరిపాలనాధికారి జోషా రెబ్బా, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.